ప్రజాశక్తి

శుక్రవారం 25 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

- డయేరియాపై ముందస్తు చర్యలు అవసరం
- పకడ్బందీగా క్లోరినేషన్ ప్రక్రియ
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో హోం శాఖ మంత్రి అనిత
- సమస్యలపై ప్రశ్నలు సంధించిన జెడ్‌పిటిసి సభ్యులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. డయేరియాలాంటి మహమ్మారి దాడి చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అందరం కలిసికట్టుగా నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అనిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మురుగు కాలువలకు ఆనుకొని తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయరాదని, జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత కాలంలో శత శాతం పూర్తి చేయాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, శివారు గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదని పలువురు సభ్యులు ప్రస్తావించగా స్పందించిన హోం

మిగతా 2లో..

రోడ్డు సౌకర్యం కోసం డోలీలతో ఆదివాసీల ప్రదర్శన



డోలీ మోతలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, గిరిజనులకు వైద్య సేవలను అందుబాటులో తేవాలని కోరుతూ గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ సభ్యులు కె.గోవిందరావు నేతృత్వాన గిరిజనులు డోలీలతో వినూత్న ప్రదర్శన, నిరసన తెలిపారు. రోడ్ల సదుపాయం లేకపోవడంతో గిరిజనులకు ఆరోగ్య సమస్యలు

మిగతా 2లో..



నిధుల విషయమై ప్రశ్నిస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

అన్ని జిల్లాలకూ నిధులిచ్చి

అల్లూరి జిల్లాను ఎందుకు విస్మరించారు ?

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ధ్వజం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా 25 జిల్లాలకు రూ.2712.50 కోట్లు కేటాయించారని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాను మాత్రం దీనిలో మినహాయించారని, అలా ఎందుకు జరిగిందని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. గురువారం జరిగిన జెడ్‌పి సమావేశంలో హోం శాఖ మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. దీనికి స్పందించిన గంగరాజు మాట్లాడుతూ మంత్రి అనిత అల్లూరి జిల్లాకు

మిగతా 2లో..

నేడు జిల్లా అభివృద్ధిపై ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

వార్త 2లో..

ప్రజల దృష్టిని మరల్చేందుకే 'ఉక్కు' ప్యాకేజీ ప్రకటనలు

వార్త 7లో..

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు

వార్త 7లో..

ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు హోంగార్డులు సస్పెన్షన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో మహారాణిపేట ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు చెందిన ఒక ఎస్ఐ, హోం గార్డు, రెండో పట్టణ ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు చెందిన ఒక ఎస్ఐ హోం గార్డులపై సిటీ పోలీస్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. వారు ఈ నెల 17వ తేదీన బీచ్ రోడ్ లోని ఒక ప్రముఖ హోటల్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం మత్తులో ఉన్న డ్రైవర్/రైడర్లను డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని బెదిరించి ఒక ఆటో డ్రైవర్ సహాయంతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డట్టు సిపికి ఫిర్యాదు అందింది. సమగ్ర విచారణ జరిపిన ఆయన మహారాణి పేట ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ప్రసాద్, రెండో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ షేక్ నజరుద్దీన్‌లను, హోం గార్డులు ఆర్.వెంకట త్రినాథ్, సిహెచ్ శివ గణేష్‌లను విధుల నుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ - కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ విశాఖపట్నం - కిరండూల్ -విశాఖపట్నం రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జత చేయనుంది. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం - కిరండూల్ రైలుకు అక్టోబర్ 25న, 08552 కిరండూల్ - విశాఖపట్నం రైలుకు అక్టోబర్ 26న అదనపు విస్టాడోమ్ కోచ్ జతచేయనున్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు.

జిల్లా విద్యాశాఖ అధికారుల బదిలీ

ప్రజాశక్తి - ఆరిలోవ : సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ ప్రిన్సిపల్‌గా, అదనపు బాధ్యతలపై పల్నాడు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిణి (డిఎస్ఇఒ)గా బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఎన్.ప్రేమ్ కుమార్ విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిగా బదిలీపై రానున్నారు.

అనకాపల్లి జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారిగా జి.అప్పారావు నాయుడు బదిలీపైరాగా, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఎం.వెంకట లక్ష్మమ్మను ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీపై వెళ్లనున్నారు.

డిఆర్‌ఒగా సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లా రెవెన్యూ అధికారిగా వైఎస్‌వికెజిఎల్. సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. అన్నమయ్య జిల్లా డిఆర్‌ఒగా పనిచేస్తున్న ఆయన్ని డిఆర్‌ఒగా నియమించి, ఇక్కడ డిఆర్‌ఒ బి.దయానిధిని సాధారణ పరిపాలనకు రిపోర్ట్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

మొదటి పేజీ తరువాయి..

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

మంత్రి రోడ్ల అభివృద్ధికి సభ్యుల సలహాలు, సూచనలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే దీనిపై కేంద్ర హోం మంత్రితో చర్చించామని కేంద్ర, రాష్ట్ర నిధుల సహాయంతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. అప్పుడే డోలీ మోత కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని అన్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు చేపడతామని ఆమె అన్నారు. వర్షాకాలంలో కాలువ గట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉందని సంబంధిత అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు వల్ల ఎన్నో దుష్ప్రయోజనాలు కలుగుతున్నాయని, ఆ పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఉచిత ఇసుక విధానం అమలులో పారదర్శకంగా ఉంటామని, ప్రజలకు సహకరిస్తామని అన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా సిఇఒ పి.నారాయణమూర్తి అజెండా అంశాలను చదివి వినిపించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాల గురించి సంబంధిత అధికారులు వివరించారు. సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బాగా అమలు చేయాలని, ప్రయివేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, పిల్లల భద్రతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో భారీగా పంట నష్టం జరిగిందని, పారదర్శకంగా అంచనాలు వేసి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఉపాధి హామీ, కల్వర్టుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, జలజీవన్ మిషన్ పనులు తదితర అంశాలపై సభ్యులు మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా స్పందిస్తాం : విశాఖ ఎంపీ శ్రీభరత్

సమావేశంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ విషయంలో స్థానిక ఎంపీ పార్లమెంటులో ప్రస్తావించాలని, న్యాయం చేయాలని ఓ సభ్యుడు విన్నవించగా ఎంపీ శ్రీభరత్ స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గడిచిన నాలుగు నెలల కాలంలో రూ.500 కోట్లు ఒకసారి, రూ.1200 కోట్లు మరోసారి మొత్తం రూ.1,700 కోట్ల నిధులు వేర్వేరు అవసరాల దృష్ట్యా విడుదలయ్యాయన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే స్థానికంగా స్పందిస్తామని ఆయన అన్నారు.

ఆహార నాణ్యత పెరగాలి : అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి

సమావేశంలో అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో అందించే ఆహారం నాణ్యతను మరింత పెంచాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరచాలన్నారు. శిథిల భవనాలకు మరమ్మతులు చేయాలని, కొత్తవాటిని నిర్మించాలని, గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని సూచించారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ స్థానికంగా ఉండే మార్కెటింగ్ కమిటీల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్థానిక ప్రజా అవసరాల మేరకు వెచ్చించాలని, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయాలపై అధికారులు దృష్టి సారించాలని, సభ్యులకు, ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. అలాగే సమావేశానికి వచ్చే సభ్యులు స్థానిక పరిస్థితులపై ముందుగానే అవగాహన కల్పించుకోవాలని, ఏయే అంశాలపై ప్రశ్నలు అడగాలో సిద్ధమై రావాలని అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని అన్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు జికె.వీధి మండలంలోని చట్రాపల్లిలో భారీ నష్టం జరిగిందని, అక్కడి ప్రజలు ఇళ్లు కోల్పోయారని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు ప్రస్తావించగా అల్లూరి సీతారాజుజిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించానని, అక్కడి పరిస్థితులను పరిశీలించానని చెప్పారు. చట్రాపల్లి గ్రామంలోని 37 కుటుంబాలను అనుకూలమైన ప్రాంతానికి తరలించి వారి కోసం పిఎం ఆవాస్ యోజన పథకం కింద మోడల్ కాలనీని నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, దినేష్ కుమార్, విజయకృష్ణన్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కోసం డోలీలతో ఆదివాసీల ప్రదర్శన

తలెత్తినప్పుడు డోలీ మోతల ద్వారా ఆసుపత్రులకు వెళ్తున్నారని తెలియజేస్తూ వారంతా డోలీయాత్రగా జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాల పరిధిలో జాజులబంద, పిత్రిగడ్డ, నీలబంద, దాయితి గిరిజన గ్రామాలకు, కొయ్యూరు మండలం మూలపేట, రోలుగుంట మండలం పిత్రిగడ్డ, నీల బంధ, పెదబుగోరు గ్రామాలను కలుపుకుంటూ అర్ల నుండి జాజులబంద గ్రామానికి రూ.కోటితో గ్రావెల్ రోడ్డు 2023లో మంజూరైందని తెలిపారు. వీటిలో రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారని, ఇప్పటికైనా గిరిజన గ్రామాలకు శాంక్షన్ అయిన రహదారులను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. హోం మంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా పివిటిజి సంఘం అధ్యక్షులు కె.వెంకటరావు, దాయితి పివిటిజిల సంఘం అధ్యక్షులు కొండబాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

26న తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ రెండో జోన్‌లో 8, 9, 10, 11, 12 వార్డుల పరిధిలోనూ, మూడో జోన్‌లో 20, 22 వార్డుల పరిధిలోనూ 26వ తేదీన పలు ప్రాంతాలలో తాగునీటికి అంతరాయం కలుగుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు టిఎల్.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జివిఎంసి కొమ్మాది పంప్ హౌస్‌లోని పంపు సెట్ల మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఆయా వార్డుల్లో తాగునీటికి అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

అన్ని జిల్లాలకూ నిధులిచ్చి

అల్లూరి జిల్లాను ఎందుకు విస్మరించారు ?

(మొదటి పేజీ తరువాయి..) నిధులు కేటాయింపు జరగని సంగతిని విస్మరించారని అన్నారు. పూర్తిగా గిరిజనులు నివసిస్తున్న, అత్యంత వెనుకబడిన జిల్లా అల్లూరి జిల్లా అని తెలిపారు. గిరిజనుల పట్ల వివక్షత తగదన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరారు. రోజువారి డోలీ మోతల వార్తలు పత్రికల్లో, టీవీల్లో వస్తున్నాయని, అవి కనబడలేదా ? అని ప్రశ్నించారు. అల్లూరి జిల్లాకు ముందుగా నిధులు ఇచ్చి ప్రజా ప్రతినిధులు మాట్లాడటం మంచిదన్నారు. ఏజెన్సీలో గంజాయి రవాణా పెరుగుతోందని, గిరిజన యువత కేసుల్లో ఇరుక్కుని విశాఖ సెంట్రల్ జైల్లో నలుగుతున్నారని తెలిపారు. గంజాయికి మాత్రం ధర ఉంటుందని, గిరిజనులు పండించే కాఫీ పంటకు మాత్రం గిరాకీ ఉండదని అన్నారు. ప్రధాని మోదీ అరకు కాఫీ తాగి, అరకు కాఫీ నెంబర్ వన్ అని ప్రశంసించినా ధర మాత్రం పెంచలేదన్నారు. కాఫీ కేజీ ధర రూ.285 మాత్రమే ఉందన్నారు. గిరిజనులు పండించే ఈ వాణిజ్య పంటకు ఎందుకు గిట్టుబాటు ధర ఇవడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాఫీ ధరను రూ.500కు పెంచాలన్నారు. అలాగే మిరియాలు కేజీ రూ.1000కి కొనుగోలు చేయాలని కోరారు. ఏజెన్సీలో రోడ్లకు నిధులు కేటాయించాలన్నారు. జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో గత నెల తుపానులో కొట్టుకుపోయి మరణించిన కొర్ర కుమారి బాధిత కుటుంబానికి నేటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. తక్షణం పరిహారం అందించాలన్నారు. అనంతగిరి మండలం గుమ్మకోట ఎపిఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ తీరు బాగోలేదని, సమన్వయం లేక అక్కడ సిబ్బంది మధ్య కొట్లాటలు జరుగుతున్నాయని, క్రమశిక్షణ లోపించి పిల్లలపై ప్రభావం పడుతోందని సభ దృష్టికి తెచ్చారు. 18 సంవత్సరాలుగా ఉన్న ఉపాధ్యాయున్ని, ప్రిన్సిపాల్‌ని వేరే చోటుకు బదిలీ చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అతిపెద్ద కర్మాగారం విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నేడు జిల్లా అభివృద్ధిపై ఇన్‌ఛార్జి మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శుక్రవారం జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం మధ్యాహ్నం జిల్లా అధికారులతో భేటీ అవుతారని చెప్పారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని అన్నారు. అన్ని విభాగాల హెచ్ఒడిలు సంబంధిత శాఖల్లో చేపట్టిన పనులపై, సాధించిన విజయాలపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు పథకం నేటి వరకు అమలు కాకపోవడాన్ని ప్రశ్నిస్తూ గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యాన విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వేదికగా ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ) మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారని, అది నేటి వరకు ఎందుకు అమలు చేయలేదని అడిగారు. ఇదే అంశాన్ని సిఎంకు పోస్ట్ కార్డుల ద్వారా తెలియజేయను న్నామన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDITINOAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
IA.No.138/2023 in OS.No.210/2023.

Between
Smt. Jada Priya ...**Plaintiff**
And
Jada Peda Rajarao
Jada Raja Mohanarao
...**Defendants**

To
(Defendant no.2)
Sri Jada Raja Mohanarao
S/o Peda Rajarao
D.no: 19-289/3, age 45 Years, Beside Adavivaram Central Jail, Srikrishnapuram, Arilova Road, Viakhapatnam.
N/o Vellatur village, Battiprolu MDL, Bapatla District

NOTICE

Take notice that you are hereby directed to appear before the Hon'ble Court on **07-11-2024** at 10.30 am Without fail or otherwise the matter will be decided in your absence.

(By Order of the court)
Advocate for Plaintiff
Yadlapalli Rajarao, Advocate,
53-33-3, KRM Colony,
Near seethammadhara
Visakhapatnam-530013
Ph : 9912979189
Dt.24-10-2024

డిక్లరేషన్

ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా నాకు ఇద్దరు సంతానం 1) కుమార్తె ఈర్ని వెంకట సూర్యకళ, 2) కుమారుడు మార్గాన వెంకట గౌరీ శంకర్. నా కుమార్తెకు పెళ్లి కాల మందు ఇచ్చిన కట్న, కానుకలు కాక అదనంగా నా భార్య బంగారు నగలు మరియు 43,00,000/- (అక్షరాల నలభై మూడు లక్షల రూపాయలు మాత్రమే) సొంత ఇళ్లు కొనగోలు నిమిత్తం ఇచ్చియున్నాను. నా కుమారునకు నేను నివసిస్తున్న డోర్.నెం.21-40-4 మరియు 21-40-4/1, చెంగలరావు పేట జంక్షన్, విశాఖపట్నం-1 మరియు డోర్.నెం.26-2-18/7 బౌండారా రోడ్డు, ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట, విశాఖపట్నం-1 చెందేటట్లుగా వీలు నామా రిజిష్టర్ చేసియున్నారు. ఇకపై నా కుమారులపైన చెప్పిన ఆస్తులను యధేచ్ఛగా అనుభవించవలెను.

ఇట్లు
మార్గాన చినబాబు

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL CIVIL JUDGE, JUNIOR DIVISION, AT VISAKHAPATNAM
O.S. 77/2024

Between:
Canara Bank rep. by its Branch Manager, DCI Branch, Seethammadhara, Visakhapatnam. ...Plaintiff
And:
1. M/s. Akshaya Motors, Rep. by its Proprietor Nunna Phani Srinivas
2. Nunna Phani Srinivas ...Defendants

NOTICE TO THE DEFENDANTS 1& 2

Defendants No.1
M/s. Akshaya Motors, Rep. by its Proprietor Nunna Phani Srinivas, S/o Mohan Ramakrishna, R/o D.No.43-11-20A, Opp to Srikanya Theatre, Railway New Colony, Visakhapatnam-16. PAN No: ANBPN6942Q; Ph.No: 9010249966

Defendants No.2
Nunna Phani Srinivas, S/o Mohan Ramakrishna, R/o D.No.43-28-3, Bharathi Nidhi Residency, TSN Colony, Visakhapatnam-16. PAN No: ANBPN6942Q; Ph.No: 9010249966.

Please take notice that the Plaintiff-Bank herein filed the above suit for recovery of an amount of Rs.11,75,477.21Ps (Rupees Eleven Lakhs Seventy Five Thousand Four Hundred and Seventy Seven Hundred and Paise Twenty one Only) approximate with up to date interest to Plaintiff Bank with future interest @@ 11.50% per annum from 28-12-2023 compounded monthly including interest and penal interest from the date of application till the date of full and final realization. In this regard, the Hon'ble Court has ordered notice to you through this paper publication by way of substituted service; if you have any objections/contentions you are requested to attend before the HONOURABLE IV ADDITIONAL CIVIL JUDGE, JUNIOR DIVISION AT VISAKHA PATNAM at **10.30 A.M on 14-11-2024** either in person or through an Advocate with all your defenses and documents, failing which the matter will be decided exparte.

By the order of the court
D.K.V.V.S.ASHWANI KUMAR
Advocate, 39-11-63/1,
Sector: XI, Muralinagar,
Visakhapatnam-07
Visakhapatnam
Date: 24-10-2024

IN THE HONOURABLE COURT OF CIVIL JUDGE (Senior Division) AT NARSIPATNAM
EP.35/2019 in OS 56/2010

Between
State Bank of India - Main Narsipatnam Represented by Branch Manager **...D.Hr**
Versus
Bolem China Demudu & Others **...J.Drs**

NOTICE OF SALE

The D.Hr bank filed above numbered EP for recovery of E.P amount and in order to recover the said amount, the schedule property will be sold in open Court by auction on **14-11-2024 from 10-30 am to 5 pm** by the Hon'ble Court. Any person i.e. any bidder who is interested in the auction may participate in the auction on that day.

By order of the court.
Date of Sale :14-11-2024
Further hearing Date :21-11-2024

SCHEDULE

Visakhapatnam District, (presently Anakapalli Dist) Narsipatnam Sub Registry, Narsipatnam Mandal, Neelampeta Panchayat, Neelampeta Village:-

Item No-1

Dry Land in Survey No.82/8 in an Extent of Ac.0-26 cents out of Ac.4.00 cents bounded by:-
East : Land of Bolem people
South : Vacant Site of Anam Mahalakshmi
West : Land of Seeramreddy Sanyasi
North : Land of Petla Peda Rammurthy

Item No-2

All that part and parcel of property of site measuring 266 Sq, yards or Ac.0.05% cents with building constructed thereon bearing Dr.No.1-93, in Sy.No.80-1 in Neelampeta village, Narsipatnam Mandal Visakhapatnam District Covered by Doct.No.1440/1997.
East : Dry land of B.Kamayya
South : Dry land of Lalam Bullebbayi
West : Property belongs to Rajababu
North : Road

Item No-3

All that part and parcel of property of site measuring 266 Sq.yards or Ac.0.05% cents with building constructed thereon bearing Dr.No.1-93 in Sy.No.80-1 in Neelampeta Village, Narsipatnam Mandal, Visakhapatnam District covered by Doct.no.1441/1997.
East : Property of B.Gangaraju covered by Settlement Deed
South : Dry land of Lalam Bullebbayi
West : Dry land of Gandempalli Konda
North : Road

Market Value of Item No.1 Rs.8,00,000/-
Market Value of Item No.2 Rs.6,82,900/-
Market Value of Item No.3 Rs.6,82,900/-

Advocate for D.Hr
POKKUNURI NARASIMHAM ADVOCATE
Behind Old Municipal Office
NARSIPATNAM. Anakapalli
Cell 9440857587
Narsipatnam
Date:18-10-2024

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE CUM S.C., S.T., COURT AT VIZIANAGARAM
E.P.No.19/2024 in O.S. No. 68/2016

Between:
Sri. Aradhyula Krishna Murty. ...Decree Holder.
And:
Smt. Rambariki Vijayalakshmi & 2 others. ...Judgment-Dabters.
TO
J.Dr.No.1: Smt. Rambariki Vijayalakshmi, w/o late Rambariki Tirupathi Naidu, Business and Owner of Huller Mill, C/o A. Bhadra Rao, Dr. No.63-2-175C, Jawahar Nagar, Srihariruram, Greatar-Visakhapatnam City, Visakhapatnam District.
J.Dr.No.2: Rambariki Srikar Naidu S/e late Rambariki Tirupathi Naidu, Employee, C/o A. Bhadra Rao, Dr.No. 63-2-175C, Jawahar Nagar, Srihari puram, Greater Visakhapatnam City, Visakhapatnam District.
J.Dr.No.3: Rambariki Srikanth Naidu S/o late Rambariki Tirupathi Naidu, Employee. C/o A. BhadraRae, Dr.No. 63-2-175C, Jawahar Nagar, Sri Haripuran, Greater Visakhapatnam City. Visakhapatnam District.

NOTICE

Take notice that the Decree Holder filed the above Execution Petition under order 21 Rule 54 to 55 of Civil Precedure Code for sale of the Execution schedule properties in Public auction for realisation of the Execution petition amount along with subsequent interest and cests. and the above Execution patition stands Postad to dt. **5-11-2024** before the above said court. All of you or your duly autherised person shall attend before the above said court at **10:30 A.M.**, failing which the matter will be decided in your absence.

(BY ORDER).

Adurthi Vasudev,
Advocate for the D.Hr.
Vizianagaram.
Cell: 9440193734
Vizianagaram.
Date:20-10-2024.

ఆక్రమణ స్థలం స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం పంచాయతీలోని జివిఎస్ అగ్రహారం సర్వేనెంబర్1లో ఆక్రమణకు గురైన కల్యాణ మండపం స్థలాన్ని గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కల్యాణ మండపం స్థలాన్ని ఆక్రమించారంటూ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. స్థానిక తహశీల్దార్ పేర్ల్ శ్యాంప్రసాద్, వితరణ వరహాలు సంఘటనా స్థలానికి చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యాన గురువారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, వివికె.కళాశాల విద్యార్థులకు ఆయా పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఆరిలోవ శాంతి భద్రతల ఎస్ఐ కృష్ణ ఈ పోటీలను పర్యవేక్షించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి గణేష్‌నగర్‌లో వైసిపి నాయకుడు వంకాయల మారుతీ ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన రక్తం సేకరించగా 60మంది క్రీడాకారులు, వైసిపి నాయకులు, ఇతర ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుల మల్లేశ్వరరావు, కురిటి సత్యం నాయుడు, జాన్ వెస్లీ, వంగపండు ఉష, పోతిన శ్రీనివాసరావు, వంకాయల సాయికుమార్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, బంగారు ప్రకాష్, పిళ్లా పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి చంద్రంపాలెం ఫీడర్‌పై మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్, దుర్గానగర్-1, దుర్గానగర్-2, కృష్ణానగర్, పోర్టు కాలనీ తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

26 నుంచి ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ రంజీ మ్యాచ్

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెంలో ఉన్న ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ మధ్య రంజీ మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్‌బాబు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌కు ఆంధ్ర జట్టుకు ఎస్‌కె.రషీద్, హిమాచల్‌ప్రదేశ్ జట్టుకు రిషి దావన్ సారథులుగా వ్యవహరించనున్నారని వెల్లడించారు.

ఐఎంఎఫ్ఎల్ డిపోలో దళితులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని వేములవలసలో ఉన్న ఐఎంఎఫ్ఎల్ డిపోలో దళితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో మేనేజరుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ, స్థానికంగా చాలా మంది నిరుద్యోగ దళిత యువకులు ఉన్నారని, వారిని లోడింగ్, అన్ లోడింగ్ పనుల కార్మికులుగా తీసుకొని ఉపాధి కల్పించాలని కోరారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని కంపెనీలు పెట్టేముందు వాగ్దానాలు ఇచ్చినా అమలు కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు భాగం లక్ష్మి పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కెవిపిఎస్ నాయకులు

నేటి నుంచి పశుగణన ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశవ్యాప్తంగా నాలుగు నెలల పాటు నిర్వహించే పశుగణన విశాఖ జిల్లాలో నేటి నుంచి ప్రారంభమవుతుందని పశు సంవర్థక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ తెలిపారు. గురువారం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే ఈ సర్వేలో పశు సంవర్ధక సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ యాప్‌లో పొందుపరుస్తారని తెలిపారు. ఇప్పటి వరకు 130 మంది ఎన్యూమిరేటర్లకు, 20 మంది పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. గురువారం మలి విడత శిక్షణలో సమాచారం సేకరణ, వాటిని యాప్‌లో ఎలా పొందుపరచాలి అనే విషయాన్ని నోడల్ అధికారి ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు తెలిపారు. జిల్లాలో 6.2 లక్షల ఇళ్లలో సమాచారం సేకరణ లక్ష్యంతో జరిగే ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ ప్రజలు, రైతులు సిబ్బందికి సహకరించి ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని డాక్టర్ రామకృష్ణ కోరారు. ఈ పశు గణన రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక ప్రణాళికలకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకులు డాక్టర్ సజ్జు శ్రీనివాస్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ రమణ, పశు వైద్యులు పాల్గొన్నారు.

జూ పార్కులో బయోలజిస్టుల కార్యశాల ప్రారంభం



కార్యశాలను ప్రారంభిస్తున్న సిసిఎఫ్ దివాన్ మైదీన్

ప్రజాశక్తి - ఆరిలోవ : సెంట్రల్ జూ అథారిటీ సహకారంతో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల ఆధ్వర్యాన గురువారం జూ పార్కులో బయోస్కోపు సమావేశ మందిరంలో జాతీయ స్థాయి జూ కన్జర్వేషన్ బయోలజిస్ట్‌ల కార్యశాలను గురువారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యశాలను సిసిఎఫ్ బిఎం దివాన్ మైదీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. జూ పద్ధతులను మెరుగు పరచడం, జూలో ఉన్న జంతువుల సంక్షేమాన్ని పెంపొందించడంపై జూ అధికారులు చర్చించారు. యానిమల్ ఎన్‌క్లోజర్ల డిజైన్‌తో వివిధ ప్రత్యేక అంశాలపై మాట్లాడారు. సమతుల్య ఆహారాన్ని రూపొందించడం, పర్యవేక్షణ, రికార్డు కీపింగ్ నిర్వహణలో ఉన్న పాములను అధ్యయనం చేయడం తదితర విషయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, సెంట్రల్ జూ అథారిటీ ఎఐజి డాక్టర్ దేవేందర్ కుమార్, మూర్తి కంటిమహంతి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని క్వారీలు నిర్వహిస్తే కేసులు

తహశీల్దార్ ఆనందరావు

ప్రజాశక్తి -పద్మనాభం : అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు గురువారం హెచ్చరించారు. క్వారీలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కోరాడ పంచాయతీ గద్దపేటలో భూ సమస్యకు సంబంధించి గెద్ద సూర్యనారాయణకు భూమిని పరిశీలించేందుకు వస్తూ పక్కనే ఉన్న చెరువులో గ్రావెల్‌ను తీయడాన్ని గమనించారు. అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



చెరువును పరిశీలిస్తున్న తహశీల్దార్ ఆనందరావు

అక్షరాస్యులుగా చేసేందుకే 'ఉల్లాస్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ హనుమంతరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామ మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులు 15 ఏళ్ల అంత కంటే ఎక్కువ వయస్సు కలిగి మధ్యలో చదువు ఆపేసిన, చదువు కోని వారిని గుర్తించి అక్షరాస్యులుగా తయారు చేయడమే 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకం ఉద్దేశమని ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం గ్రామ స్వయం సహాయక సంఘాల సభ్యులతో 'ఉల్లాస్' పథకం విధి విధానాలను వివరించారు. సంఘాల్లో ఉన్న ప్రతి 10 మందికి టీచర్‌గా ఓ వాలంటీర్‌ను ఎంపిక చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వెలుగు ఎపిఎం జి.నాగభూషణరావు, సిసిలు మీసాల అప్పలనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. వాంబే కాలనీ జిఎఫ్‌లో మామిడి సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. అతని కుమార్తె మోనిక నగరంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 23వ తేదీన కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో కుటుంబీకులు ఆరా తీసినా ఎక్కడా ఆచూకీ కానరాలేదు. దీంతో తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

నేవీ పాఠశాలలో జిమ్ సర్ వైద్యసేవలు

ప్రజాశక్తి -మధురవాడ : నౌసేనాబాగ్ సమీపంలోని తూర్పు నౌకాదళానికి చెందిన పాఠశాలలలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య నిపుణులు కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం గురువారం ముగిసింది. సుమారు 3వేల మంది బాలబాలికలకు గీతం వైద్య నిపుణులు తనిఖీలు చేశారు. ముఖ్యంగా దంత, నేత్ర, చెవి, ముక్కు, చర్మ వ్యాధుల నిపుణులు ఉచిత వైద్య పరీక్షలను జరిపారని జిమ్సర్ వైద్య వ్యవహారాల పర్యవేక్షకుడు డాక్టర్ బి.కార్తీక్ తెలిపారు. తూర్పు నౌకాదళం బాలలకు ఇంత పెద్ద ఎత్తున వైద్య పరీక్షలను నిర్వహించడం ఇదే ప్రథమం అని తూర్పు నౌకాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ మురళీ మోహన్‌రాజు పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి. సుచిత్ర సేవలను అభినందించారు. జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి మాట్లాడుతూ, సామాజిక వైద్య సేవలను అందించడం తమ ప్రధాన కర్తవ్యం అన్నారు.

ఉచిత కేన్సర్ శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ దుర్గాబజార్‌లో గల ఆర్ఎస్.నాయుడు పోలీ క్లినిక్‌లో విశాఖ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. రోగులు సుమారు 150 మంది హాజరై ఉచిత పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయుడు పోలి క్లినిక్ డాక్టర్ ఆర్ఎస్.నాయుడు, మెడి కవర్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ జై సాయిచందు, మనోజ్, వెంకట్, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మోపిదేవిని కలిసిన మత్స్యకార నాయకులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : మాజీ మంత్రి, టిడిపి నేత మోపిదేవి వెంకటరమణను విశాఖ నగరంలోని దసపల్లా హోటల్‌లో జివిఎంసి నాలుగో వార్డు పరిధిలోని టిడిపికి చెందిన పలువురు మత్స్యకార నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.
మోపిదేవిని కలిసిన వారిలో గరికిన ఎల్లయ్య, వాసుపల్లి ఎల్లయ్య, సూరాడ నరసింగరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన టైప్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 28, 29 తేదీల్లో జరిగిన టైప్ రైటింగ్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ గురువారంతో ముగిసింది. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన డిసిసిపి విభాగాధిపతి డాక్టర్ జి.రాజేశ్వరి పర్యవేక్షణలో ఈ నెల 18న స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభమైన విషయం విదితమే. ఈ మూల్యాంకనలో చిట్టివలస, చినవాల్తేరు, డెయిరీ ఫామ్, మద్దిలపాలెం, దండు బజార్, గోపాలపట్నం, కంచర పాలెం టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్స్, స్టాఫ్ ఫ్యాకల్టీలు అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారని చిట్టివలస లక్ష్మీ టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ బల్లా వెంకటరావు గురువారం తెలిపారు

జూనియర్ కళాశాల స్థలానికి ప్రహరీ ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన సర్వే నెంబర్ 276 స్థలంలో గురువారం ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు తహశీల్దార్ పేర్ల శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జూనియర్ కళాశాల స్థలాన్ని ఇటీవల కొంతమంది ఆక్రమణకు పాల్పడటంతో రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకొని ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సైకాలజిస్ట్ లావణ్యను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి: ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో రుతు పరిశుభ్రత, ఆరోగ్యంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ నీలం లావణ్య మాట్లాడుతూ ఆరోగ్యం అంటే డిసీజ్ ఫ్రీ, పెయిన్ ఫ్రీ, హైజిన్ అంటే నీటినెస్, క్లీనెస్ అని చెప్పారు. విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాత్మక విషయాలను చెప్పి వారి సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను చూపించారు. అనంతరం లావణ్యను కాలేజీ కరస్పాండెంట్, సెక్రటరీ టి.థియోఫిలస్ సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎజ ఫ్లోరా, విజయ, అరుణ, సిఇఒ వి.నెక్సస్ హబ్ గణేష్, ఎన్ఎస్ఎస్ పిఒ జి.మంజుల, ఎన్.సంధ్యారాణి పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలి : సిపిఐ

ప్రజాశక్తి -మధురవాడ : మద్యం ధరలు తగ్గించి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని చెపుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు నిత్యం వాడుకుంటున్న బియ్యం, పప్పులు, వంట నూనె తదితర వస్తువుల ధరలను నియంత్రించాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. భారీగా పెరిగిన ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం జివిఎంసి 5వ వార్డు పరిధి నగరంపాలెం, పోర్టు కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, భారీగా పెరిగిన ధరల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సనాతనధర్మం, తిరుపతి లడ్డు అంశాలు తీసుకొచ్చారని విమర్శించారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మోయలేని భారమౌతున్న ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎమ్.డి.బేగం, వి.సత్యనారాయణ, డి.సతీష్, కె.చిన్నా, పి.రమణ, రాము, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో దుర్గంధం



మురుగు చేరిన కాలువ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సిఎస్‌బి బ్యాంక్ పరిసర షాపుల వద్ద ఉన్న మురుగునీరు కాలువ పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కాలువలు ఏర్పాటుచేసి సుమారు ఏడాది అవుతున్నా నీరు పోవడానికి వీలు లేక మురుగు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతోంది. కాలువలో మురుగనీరు, చెత్త ఉండిపోవడంతో పాదచారులకు, బ్యాంకు ఖాతాదారులు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. వేములవలస, బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీల సరిహద్దుల్లో ఉండడంతో పారిశుధ్య పనులు ఎవరూ చేపట్టక మురుగు నిల్వ చేరుతోంది. మురుగు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు చొరవ తీసుకొని మురుగునీరు పోవడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు, షాపులు యజమానులు కోరుతున్నారు.

నైపుణ్య కోర్సులతో మెరుగైన ఉపాధి

ప్రజాశక్తి-విశాఖపట్నం : నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించే సర్టిఫికెట్ విలువ కలిగి ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఎయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో నాక్‌లో ఎయు అత్యుత్తమ స్థానాన్ని సాధించిందని, ఎయు అభివృద్ధిని వివరించారు.

పంచ గ్రామాల భూసమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల కాలనీ అసోసియేషన్లు, సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే సెటిల్‌మెంట్ రికార్డ్స్ 1903లో ఉన్న రైతుల నుంచి కొనుక్కొని ఇల్లు కట్టుకున్నామని, ఇంకా స్థలాలు కూడా కొనుక్కున్నామని వివరించారు. ఈ సమస్యపై 2014లో హైకోర్టు ఆదేశాలతో అప్పటి ప్రభుత్వం సిసిఎల్ఎ ద్వారా జాయింట్ కలెక్టర్‌తో కూడిన ముగ్గురు అధికారుల కమిటీ వేసిందని తెలిపారు. ఆ కమిటీ కూడా 1977 నుంచి 1996 వరకు ఇచ్చిన పట్టాలు, గెజిట్లు చెల్లవని చెప్పినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినతిని పరిశీలించి ఇళ్ల సమస్యలను పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, టివి.కృష్ణంరాజు, బి.రమణి, విబిఎన్.ప్రతాప్, జివి.కృష్ణారావు, రాము, హనుమంతరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంగారావు, టివి.కృష్ణంరాజు, రమణి తదితరులు

28న ధర్నాను జయప్రదంచేయాలి



జనరల్ బాడీ సమావేశం అనంతరం మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ నెల 28వ తేదీన జ్ఞానాపురంలోని జోన్-5 ఆఫీస్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. జివిఎంసి 49, 50, 51 వార్డుల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు, 2018-20 వరకు కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన 2 శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ డబ్బులను ఎస్‌ఎల్ఎఫ్‌లో పెట్టుకోవడం అన్యాయం అన్నారు. కట్ చేసిన సొమ్ము సుమారు రూ.3 కోట్లను కార్మికుల ఖాతాలో జమ చేయని పక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. వార్డు కమిటీ మెంబర్లు భద్ర, పాపారావు, దేవి, లక్ష్మి, రమణ, శివ, అప్పలరాజు, శంకర్, బంగారయ్య, బాలరాజు, ధన, సత్యవతి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పలు విభాగాల్లో రెక్టార్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లీష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా వివిధ విభాగాలను రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరు, కళాశాల వేళల్లో డిపార్ట్‌మెంట్లలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆయా విభాగాలలో విద్యార్థులకు జరుపుతున్న బోధనను ప్రత్యక్షంగా పరిశీలించారు.



జగన్‌ను కలిసిన సతీష్

ప్రజాశక్తి-సీతమ్మధార : విజయనగరం జిల్లా గుర్ల వెళ్తూ విశాఖ ఎయిర్‌పోర్టులో ఆగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ గురువారం కలిశారు. నగరంలోని రాజకీయ అంశాలపై కాసేపు చర్చించినట్లు సతీష్ తెలిపారు.

గాజువాకలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషిచేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనిట్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపుతో ముందుకు వెళ్తున్నాయని, పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని చెప్పారు. నారాయణరావు మాట్లాడుతూ, వార్త రాసేటప్పుడు నైతికత, నిబంధనలను దృష్టిపెట్టుకోవాలని సూచించారు. సెక్రటరీ శ్రీనివాసరావు, మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎపిడబ్ల్యుజెఎఫ్ ముందుంటుందన్నారు. ఆజాద్ దినపత్రిక సంపాదకులు పితాని ప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌లో భాగస్వామ్యం అయినందుకు గర్వపడుతున్నానన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి తన వంతు సహాయంగా రూ.50వేలు సొంత నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని గంట్ల శ్రీనుబాబు అభినందించారు.

ఇండో పసిఫిక్ ప్రాంత ఆర్థిక ప్రగతిపై గీతంలో సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు భద్రత అంశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును గురువారం విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలో నేడు రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య, ఇజ్రాయల్‌లో సమాంతరంగా జరుగుతున్న యుద్ధాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా బలమైన దేశాలు ప్రపంచ శాంతి కోసం, అభివృద్ధి కోసం ఆలోచించడం మరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశం, తమ అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచించే నాయకులు ప్రపంచ దేశాల అధినేతలుగా ఉన్నంత కాలం సమగ్ర అభివృద్ధి సాధ్యపడదన్నారు. పర్యావరణం, ప్రజారోగ్యం, ఉపాధికల్పన, రక్షిత మంచినీటి సరఫరా ప్రపంచ జనాభాలో ప్రతి ఒక్కరికి అందేలా చేయడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (న్యూఢిల్లీ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడిపండిట్ మాట్లాడుతూ, ఇండో పసిఫిక్ ప్రాంతంలో తైవాన్ దేశం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో ఆ దేశానికి గల బలం ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. తైవాన్‌తో భారత్ సంబంధాలు భవిష్యత్తులో మరింతగా మెరుగుపడగలవన్నారు. గీతం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, ప్రపంచంలోని అగ్రరాజ్యాలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడటం కోసం తృతీయ ప్రపంచ దేశాలలోని వనరులను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. మితిమీరిన రుణాలతో పలు దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం వెనుక అగ్ర రాజ్యాల అనైతిక చర్యలే కారణమన్నారు. భారత దేశం ఆర్థిక శక్తిగా ఎదగడానికి శాంతి, పారదర్శకత స్నేహ సంబంధాలను నమ్ముకోవడం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ అధికారిక ప్రతినిధి రాబర్ట్ హిష్ తైవాన్ చారిత్రిక నేపథ్యం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ప్రపంచ దేశాలతో, భారత్ సంబంధాలను వివరించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అల్కాఆచార్య, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్చార్జి డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.సుశ్యరాజ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎమ్‌వి. కులకర్ణి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

పాల సేకరణ ధర తగ్గింపుపై 29న విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి



పరవాడలో నినాదాలు చేస్తున్న పాడి రైతులు

ప్రజాశక్తి-పరవాడ

విశాఖ డెయిరీ ఆవు పాలు సేకరణ ధర తగ్గించడంపై ఈ నెల 29న జరుగు విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆవు పాలు ధర తగ్గించి రైతుల ఆదాయాలకు గండి కొట్టడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఉదయం పరవాడ పాల సేకరణ కేంద్రం వద్ద రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్ విశాఖ డెయిరీ ఎగ్గొట్టిందని తెలిపారు. ఒక వైపు పశు దాణాను అధిక ధరకు విక్రయిస్తున్న డెయిరీ యాజమాన్యం, మరో వైపు పాల సేకరణ ధర తగ్గించడం దారుణమన్నారు. పాల రైతుల డబ్బులతో డెయిరీ కూడబెట్టిన ఆస్తులు పాలకవర్గం ఇష్టానుసారంగా ఖర్చు చేస్తూ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేగుల రామ సూరప్పారావు, కృష్ణ, పాల రైతులు పోతల శంకర్రావు, బొడ్డే అప్పలనాయుడు, రెడ్డి నాయుడు, సతీష్, బండార్ చిన్నోడు, పైలపైడు నాయుడు, నాగేశ్వరరావు, పైల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : పాల సేకరణ ధర తగ్గింపుపై మండలంలో నిరసనలు ఆగడం లేదు. ఇందులో భాగంగా నాగులపల్లి గ్రామంలోని పాల సేకరణ కేంద్రం వద్ద బుధవారం రాత్రి సిపిఎం, స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు ఎస్ బ్రహ్మాజీ, బుద్ధ రంగారావు మాట్లాడుతూ పాడి రైతులకు ఇన్సూరెన్స్ ఉన్నా అమలు కావడం లేదని, దానిని పూర్తిస్థాయిలో వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలమర శెట్టి గణేష్, దాడి సత్యనారాయణ, దొడ్డి రామునాయుడు, మల్ల భాస్కరరావు, దాడి పురంధర్, కాంగ్రేగుల ముసిలినాయుడు, ముచ్చకర్ల సత్తిబాబు, పెంటకోట సన్యాసినాయుడు, ఎం.సూరప్పారావు, జి.హరి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తగ్గించిన పాల ధరను పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలో పెదపాడు, ఉప్పవరం గ్రామాలలో గురువారం రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు కె రామ సదాశివరావు, రైతు సంఘం నాయకులు బుద్ధ రంగారావు, కార్మిక సంఘ నాయకులు ఎస్ బ్రహ్మాజీ, రైతులు అమలకంటి మహాలక్ష్మి నాయుడు, చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.



నాగులాపల్లిలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు



మాట్లాడుతున్న జెవివి నాయకులు

27న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 27న ఆదివారం జిల్లాస్థాయి చెక్కుముకి సంబరాలు (పోటీలు) నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటఅప్పారావు తెలిపారు. అచ్యుతాపురంలో గురువారం ఆయన మాట్లాడుతూ చెకుముఖి సంబరాలలో భాగంగా క్విజ్, సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 70 స్కూల్స్ నుంచి 70 టీములు ఈ పోటీలలో పాల్గొంటాయని చెప్పారు. సమావేశంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల వ్యవస్థాపకులు ధర్మిరెడ్డి ప్రసాద్, జెవివి జిల్లా ప్రతినిధి ఎం రామ్ కుమార్ పాల్గొన్నారు.

పశుగణనలో సమగ్ర సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 25 నుండి 2025 ఫిబ్రవరి 28వరకు అఖిల భారత పశు గణన కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో జీవాల పెంపకం దారులు సమగ్ర సమాచారం పశు గణన సిబ్బందికి ఇవ్వాలని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పశు గణన కోసం మండలం లోని 15 మంది పశు సంవర్ధక శాఖ సిబ్బందిని విషయ సేకరణదారులుగా నియమించగా పశువైద్యాధికారులు సూపవైజర్లుగా వ్యవహరిస్తారన్నారు.



భార్గవిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

అథ్లెటిక్స్‌లో భార్గవి ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో బిఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న రెడ్డి భార్గవి ప్రతిభ చూపుతోంది. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పరుగు పందెంలో 200 మీటర్లు, 400 మీటర్లు, 1600 మీటర్ల విభాగాలలో మూడు బంగారు పతకాలు సాధించింది. అలాగే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్స్-2024 పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేసి భార్గవిని అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, ప్రిన్సిపాల్ వేచలపు అర్జునరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అదట్రావు రామారావు, ఏవో చీపురుపల్లి దేముడు నాయుడు, మేడిశెట్టి శంకర్రావు, ఎన్‌సిసి ఏఎన్ఓ సయ్యపు రెడ్డి గణేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని 33/11కెవి అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పిఎంఐ వర్క్ కారణంగా ఈనెల 25న శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతకాపల్లి ఫీడర్ పరిధిలోని అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపురఅగ్రహారం, అరిపాక, బంగారమ్మపాలెం, అడ్డురు, గొట్టివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కశింకోట : కశింకోట మండల నరసింగబిల్లి సబ్ స్టేషన్స్ 11కేవి ఫీడర్స్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఇపిడిసిఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల నర్సింగబిల్లి, గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొతపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, ఏనుగు తుని, సోమవారం, చినఏనుగు తుని, జి.భీమవరం, అడ్డం, అచెర్ల, కొత్తఅచెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

పంట బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రబీ పంటకు సంబంధించి పంటభీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్ తెలిపారు. పంటల భీమాపై గురువారం జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, వ్యవసాయ అధికారులు పాల్గొన్న వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది కౌలు రైతులుండగా రెండు లక్షల మందికి మాత్రమే బ్యాంకురుణాలు అందాయని, మిగిలిన వారి పేర్లు లిస్టులకు దగ్గరలో గల బ్యాంకులకు లింకుచేసి వారికి కూడా రుణాలు అందించుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రబీకి సంబంధించి జీడిపంటకు నవంబరు 15వ తేదీ, ఇతర పంటలకు డిశంబరు 15తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించడమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖఅధికారులు పాల్గొన్నారు.

ఎన్‌డిపిఎస్ సెల్ ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు, దాడులు జరిపేందుకు కేంద్రీకృత ఎన్‌డిపిఎస్ సెల్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. దీనికి ప్రత్యేకంగా అధికారులను, సిబ్బందిని కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా జరిగే వివిధ మార్గాలు, దారులు, అనుమానస్పద గ్రామాలు, ప్రదేశాలు, వ్యక్తుల పై నిఘా కొనసాగించడం, ప్రణాళికలు రచించడం జరుగుతుందని చెప్పారు. స్టాటిక్, డైనమిక్ చెక్ పోస్టను బలోపేతం చేయడం, తప్పించుకుని తిరుగుతున్న గంజాయి కేసుల్లోని నిందితులను అరెస్టులు చేసేందుకు సహకరించడం, పట్టుబడిన గంజాయి కేసుల దర్యాప్తులో నిందితులకు సంబంధిత కోర్టులలో కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. వివిధ గంజాయి కేసులలో నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్ట్ కింద నమోదు చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, గపూర్, బాల సూర్యరావు, లక్ష్మి, రమేష్, వినోద్ బాబు, ఎస్సైలు సురేష్ బాబు, ఆదినారాయణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి కూటమి ఎన్నికల హామీలో ఒకటైన మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం వెంటనే అమలు చెయ్యాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్సుల్లో పోస్ట్ కార్డు ద్వారా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఐదు నెలలు అయినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు పరచటంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న, జిల్లా సమన్వయకర్త గురునాథం, భానుమూర్తి యాదవ్, కెవి మాణిక్యం, సేనాపతి రాజు, కె.ఏడుకొండలు, తుట్టా రమణ, పిఎస్ దత్తు, టి.ఆనంతరావు, పడాల కొండలరావు, వి.రాము, ఆర్ఆర్ నాయుడు, బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు డైట్ విద్యార్థిని ఎంపిక



జయశ్రీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అఖిలభారత అంతర విశ్వ విద్యాలయాల తైక్వాండో పోటీలకు డైట్ కాలేజీ విద్యార్థిని యు.జయశ్రీ ఎంపికైంది. నవంబర్ 13, 14 తేదీలలో పంజాబ్ రాష్ట్రం, అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరుగు అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయ టైక్వాండో పోటీలలో ఆమె పాల్గొంటున్నట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్ కె కృష్ణనాగు, డీన్ అడ్మిన్ కె . ఈశ్వరరావు, హర్షం వ్యక్తం చేశారు.

టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా బాలుర టెన్నికాయిట్ జిల్లా స్థాయి సెలక్షన్ పోటీల్లో మండలంలోని తెనుగుబూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతి విద్యార్థి పి సాయికుమార్ అండర్-17 విభాగంలో, 9వ తరగతి విద్యార్థి ఎన్ మణికుమార్ అండర్-14 విభాగంలో పాల్గొని, ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపును రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు సదరు విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావులను స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.రఘు, ఎస్ఎంసి చైర్మన్ ఇరట నరసింహామూర్తి అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

అసైన్డ్ భూముల సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

అసైన్డ్ భూముల సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని, గతంలో పట్టాలు ఇచ్చిన అసైన్డ్ భూములను వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 13 లక్షల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. 1977 అసైన్డ్ చట్టానికి వైసిపి ప్రభుత్వం సవరణలు చేసి, భూములను ఫ్రీ హోల్డ్ చేసి పేదల భూములను పెద్ద ఎత్తున పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఈ చట్ట సవరణలు రద్దు చేసి అన్యాక్రాంతమైన భూములను తిరిగి పేదలకే అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూములను ఏదో విధంగా తన చేతిలోకి తీసుకోవాలనే దుర్బుద్ధితో ఉందని విమర్శించారు. ఫ్రీ హోల్డ్ భూములకు మార్కెట్ విలువకు రెండున్నర రెట్లు ఫీజు చెల్లిస్తే హక్కులు కల్పిస్తామని చెప్పడాన్ని వెంకన్న తప్పుబట్టారు. కోనేరు రంగారావు కమిటీ నివేదిక ప్రకారం 40 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలిచ్చి వారికి వెంటనే స్థలాలు చూపాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇంటి స్థలం లేనివారికి మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు.



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న గండి రవికుమార్

విజయసాయిరెడ్డిని కలిసిన రవికుమార్

ప్రజాశక్తి-సబ్బవరం : రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, వైఎస్ఆర్‌సిపి ఉమ్మడి విశాఖపట్నం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను సీతమ్మధార క్యాంపు ఆఫీసులో పెందుర్తి నియోజకవర్గం వైసిపి నాయకులు గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులు జేసీబీ ప్రసాద్, యడ్ల నాయుడు, మొగలిపురం ఉప సర్పంచ్ సిరపరపు వాసు, అప్పికొండ సత్యనారాయణ ఉన్నారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం కార్యకర్తలంతా సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం యలమంచిలి పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ నాయకులు పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం బలం అంతా అట్టడుగు కార్యకర్తలేనని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూళి రంగనాయకులు, వసంతవాడ దినబాబు, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, నాగేశ్వరరావు, ఆదిమూర్తి, కర్రి శివ, కొఠారు సాంబ, భీశెట్టి చిన్నారావు, సూరకాసుల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంగా అనకాపల్లి పట్టణ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఆంధ్రప్రదేశ్ అవతరణలో పొట్టి శ్రీరాములు పాత్ర' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు 4 అరఠావు పేజీలకు మించకుండా స్వదస్తూరితో తెలుగు భాషలో మాత్రమే రాసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం లోగా స్వయంగా గాని, ఏదైనా పోస్టు ద్వారా గాని పంపించాలని సూచించారు. విజేతలకు 1వ తేదీన బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు. వ్యాసరచనలను బల్లా నాగ భూషణం, డోర్ నంబరు 10-01-88, పిళ్ళావారివీధి, చేపల బజార్ దగ్గర్లో, అనకాపల్లి -531001 అన్న అడ్రస్‌కు పంపించాలని కోరారు.

పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళ కళాశాలల పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీస్ నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్లో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిలు మద్యం సేవించడం, గంజాయి అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. డిజె సౌండ్స్ వల్ల పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిపై కూడా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, రావి దేవుళ్ళుకొల్లు సత్యారావు, పాల్గొన్నారు.

హాస్టళ్లకు పూర్తిస్థాయి వార్డెన్లను నియమించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు పూర్తిస్థాయి వార్డెన్ల నియామకం చేపట్టాలని, వసతి గృహాలలో విద్యార్థులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం బిఎస్‌పి అనకాపల్లి ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో పూర్తిస్థాయి వార్డెన్లు లేకపోవడంతో తరచూ కింద సిబ్బంది విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి చిన అప్పారావు, ఉడింగల నాగేంద్ర కుమార్, వనమాల నాగభూషణం, కొల్లి సత్యారావు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతపై అవగాహన

ప్రజాశక్తి-యలమంచిలి

వ్యవసాయంలో సాంకేతికత పెంపొందించుకోవాలని, ఇందు కోసం ఆధునిక సాంకేతికత పట్ల రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీధర్ అన్నారు. గురువారం యలమంచిలి వ్యవసాయ ఏడి కార్యాలయంలో సబ్ డివిజన్ రైతు సేవా కేంద్రాల సిబ్బందికి నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న సాంకేతిక పద్ధతులు ఫలితాలను త్వరతగతిన చేర్చాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాలపై ఉందని ఆయన చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ పెస్ట్ సర్వైవలెంట్ సిస్టం ఆప్‌ను అందరూ వినియోగించుకోవాలన్నారు. బిసిటి కృషివిజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ బండి నాగేంద్రప్రసాద్ ప్రస్తుతం వరి పొలాలలో ఉన్న చీడపీడల నివారణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త విజేత, తులసిమణి, వ్యవసాయాధికారి మోహనరావు పాల్గొన్నారు.



మంటల్లో కాలిపోతున్న పశువుల పాకలు

3 పశువుల పాకలు దగ్ధం

- పాడి ఆవు, నాటు కోళ్లు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని పరవాడపాలెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన గొంతిన రమణ, గొంతిన జగ్గారావు, పరవాడ అప్పలనాయుడులకు చెందిన మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... బుధవారం అర్ధరాత్రి సమయంలో పశువుల పాకలకు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన గ్రామస్తులు అక్కడ చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో మూడు పశువుల పాకలు పూర్తిగా కాలిపోయాయి. గొంతిన జగ్గారావుకు చెందిన ఒక ఆవు మంటల్లో సజీవ దహనమైంది. అప్పలనాయుడుకు చెందిన నాటు కోళ్లు అగ్ని ఆహుతయ్యాయి. రమణకు చెందిన వరికుప్పలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం బాధితులను వెంటనే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

అసంపూర్తి బ్రిడ్జిని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల, వేచలం గ్రామాల మధ్య శారదా నదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జిని గురువారం అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.ఆయేషా పరిశీలించారు. బ్రిడ్జికి రెండు పక్కల ఉన్న అప్రోచ్ రోడ్డుకు సంబంధించి అవసరమైన రెండు ఎకరాల 30 సెంట్లు భూ సేకరణ గురించి సంబంధిత 10 రైతులతో మాట్లాడారు. మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం రైతులకు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలు నిర్వహణ ప్రక్రియ తయారు చేస్తున్నామన్నారు. మండలంలో నాలుగు చిన్న తరహా, ఐదు పెద్ద తరహా నీటి సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ గ్రామసభల్లో అధిక శాతం రీ సర్వే గురించి దరఖాస్తులు వస్తున్నాయని ఆర్‌డిఒ తెలిపారు. అనంతరం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు లక్ష్మీదేవి, టిడిపి నాయకులు దొగ్గ నాయుడుబాబు, కార్యకర్తలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

బహిరంగ మల విసర్జన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శివారు నేతవాణిపాలెం గ్రామంలో బహిరంగ మల విసర్జన ప్రాంతంలో గ్రీన్ మ్యాట్, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని మంచినీటి ట్యాంక్ సమీపంలో కొంత కాలంగా గ్రామస్తులు చెత్త చెదారం వేయడంతో పాటు బహిరంగ మల విసర్జన చేస్తున్నారు. ఇటీవల డిపిఒ శిరీష రాణి గ్రామంలో పర్యటించిన సందర్భంగా అక్కడి అపారిశుధ్యంపై అధికారులపై మండిపడ్డారు. చెత్త చెదారం తొలగించాలని ఆదేశించారు. దీంతో గురువారం బుచ్చయ్యపేట పంచాయతీ సిబ్బంది సదరు ప్రదేశంలో గ్రీన్ మ్యాట్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

చినగంగవరానికి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గరిసింగి పంచాయతీ శివారు చినగంగవరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గొర్లె/గ్రెడ్డి కొండలరావు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గరిసింగి గ్రామపంచాయతీలో 10 శివారు గ్రామాలు ఉన్నాయని, దీని వల్ల చినగంగవరం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

డ్రోన్ పిచికారీపై విస్తృత పరిశోధనలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : డ్రోన్ పిచికారిపై అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పంట కోత అనంతర విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి వి కే జగన్నాథరావు, డాక్టర్ పి శ్రీదేవి, డాక్టర్ ముకుందరావు, జి కుసుమ శాస్త్రవేత్తల బందం విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. ఉత్తర కోస్తా జిల్లాల ముఖ్య పంటలైన చెరకు మొక్కజొన్న పంటలపై జరుగుతున్న ఈ పరిశోధనలో పురుగు మందులు, చీడ పీడ మందులు, జీవ నియంత్రణ కారకాలతో పిచికారి చేసే విధానంపై పరిశోధనలు జరుగుతున్నట్లు డాక్టర్ జగన్నాధ రావు తెలిపారు. గత రెండేళ్ల పరిశోధనలను పరిశీలిస్తే డ్రోన్‌ను నాలుగు ఎమ్ ఎల్ ఎస్ వేగంతో, 1.1 మీటర్ల ఎత్తులో నడిపినప్పుడు చీడ పీడలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు.

శానిటేషన్ సెక్యూరిటీ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టాలని ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు, ఉద్యోగులు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ నెలల తరబడి చెల్లించకుండా, కార్మికుల డబ్బులు వాడుకొని కార్మికుల శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్. సంతోష్, అడ్డా ప్రసాద్, వడ్డాది పోలారావు, అడవి రాజు, ఎస్.కిరణ్, కొండపల్లి వరలక్ష్మి, వడ్డాది ఉమా, వివిఎమ్ నాయుడు, కూండ్రపు వరలక్ష్మి, మహేశ్వరి, ఆర్ జ్యోతి, రామ్ ప్రసాద్, గంధర్, నూకరాజు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలపై కూటమి నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలని ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి రింగ్ రోడ్డు, జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నీటి సంఘాల ఎన్నికలపై కశింకోట మండలం కూటమి నాయకులతో కూర్చొని సమీక్ష చేశారు.

తహశీల్దార్‌ను కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి-సబ్బవరం : ఇటీవల నూతనంగా సబ్బవరం మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బి.చిన్నికృష్ణను గురువారం బాటజంగాలపాలెం గ్రామ సర్పంచ్ వడాల వెంకటరమణ, ఆ గ్రామ పంచాయతీ టిడిపి కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, సాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీలోని రెవెన్యూ పరమైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కూటమి నేతలు వనం సత్యనారాయణ, గొంప నర్సింగరావు, పాల్గొన్నారు.


ఇనాం సాగు రైతులకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో మూడు తరాలుగా ఇనాం భూములను సాగు చేస్తున్న రైతులకు రైతు వారి పట్టాలు ఇవ్వాలని స్థానిక తహశీల్దార్ భాగ్యవతికి ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన గురువారం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ చౌడువాడ ఇనాం భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేసి పట్టాలు మంజూరు విజ్ఞప్తి చేశారు. ఎండోమెంటు రిజిస్టర్‌లో నిషేధిత జాబితా 22ఎలో ఏ విధంగా రికార్డు అయ్యాయో సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కుమార వెంకటరమణ, సంఘం సభ్యులు కుమార విశ్వనాథం, సన్యాసినాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన నాగ జగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను అమరావతి సచివాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి సత్యనారాయణ మూర్తి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు



గొలుగొండలో అర్జీలు స్వీకరిస్తున్న డిటి చయనులు

ప్రజాశక్తి - గొలుగొండ : మండలంలోని తాళ్లచీడికాడ గ్రామంలో గురువారం రీ సర్వే రెవెన్యూ గ్రామసభ ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహశీల్దార్ చయనులు రైతుల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రీ సర్వేలో ఏమైనా తప్పులు జరిగితే వెంటనే దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ, విలేజ్ సర్వేయర్ కోమలి పాల్గొన్నారు.

కోటవురట్ల:. మండలంలో చౌడువాడ గ్రామంలో గురువారం తాహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలు నెలకొన్న తప్పిదాలు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో లోపాలు, భూసమస్యలుంటే గ్రామసభలో ఫిర్యాదు చేయాలని, పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. చౌడువాడ గ్రామ సభలో 75 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాలకృష్ణ, మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ ఐ ఊర్ధ్వరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం పంచాయితీలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 74 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఈ సమస్యలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, సర్పంచ్ గొర్లి రాజేష్, గ్రామ టీడీపీ అధ్యక్షులు వాకాడ కనకరాజు, వాకాడ గోవిందరావు, జనసేన నేత బలిరెడ్డి సత్యనారాయణ, కోనేటి సంతోష్, వీఆర్వో రామఅప్పారావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బుచ్చయ్యపేట గ్రామసభలో మాట్లాడుతున్న లక్ష్మి

బుచ్చయ్యపేట : మండలంలోని కెపి అగ్రహారం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూ రీ సర్వేలో సమస్యలపై 20 ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి త్వరలోనే వాటికి పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, ఉప సర్పంచ్ దేవర ముసలి నాయుడు, టిడిపి నాయకులు వియ్యపు నాగేశ్వరరావు, అడ్డూరు శ్రీను, దేవర భూలినాయుడు, విఆర్ఓ జగన్నాధం, సర్వేయర్ భవాని శంకర్, రైతులు పాల్గొన్నారు.

విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఓ

డాక్టర్ శ్రీరామ్మూర్తి హఠాన్మరణం



డాక్టర్ శ్రీరామ్మూర్తి (ఫైల్)

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాయపురెడ్డి శ్రీరామ్మూర్తి గురువారం మధ్యాహ్నం హఠాన్మరణం పొందారు. విశాఖపట్నం వెళ్లేందుకుకారులో కుటుంబ సభ్యులతో బయలుదేరి వెళ్తుండగా, నర్సీపట్నంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృత్యువాత పడ్డారని కుటుంబసభ్యులు తెలిపారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన తర్వాత నాతవరం, కొయ్యూరు, నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లో డాక్టర్గా విధులు నిర్వర్తించిన డాక్టర్ శ్రీరామ్మూర్తి, డిప్యూటీ డిఎంహెచ్ఓగా ఉద్యోగ విరమణ చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఎస్డబ్ల్యుఓ జయలక్ష్మి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో బాలికల పాఠశాల విద్యార్థులకు ఎఎస్డబ్ల్యూ జయలక్ష్మి గురువారం దుప్పట్లు పంపిణీ చేపట్టారు, ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిఎస్సి కోచింగ్ శిక్షణ తరగతులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 25తో గడువు ముగుస్తున్నట్లు తెలిపారు శ్రీప్రకాష్, స్పేస్ డిగ్రీ కాలేజ్, ఎస్వీఎస్ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అర్హులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు, వసతి గృహ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. నాణ్యమైన విద్య భోజనం అందిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతీ పాఠశాల నుండి ముగ్గురిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే 'ఉక్కు' ప్యాకేజీ ప్రకటనలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : కార్మికులు, ప్రజల సహకారంతో ఉక్కు పరిరక్షణ ఉద్యమం విజయవంతంగా సాగుతోందని, ప్రజల సహకారాన్ని ఆ ఉద్యమానికి దూరం చేయడం కోసమే విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్యాకేజీలు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు అన్నారు. స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1351వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్యకర్తలు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల దృష్టిని మరల్చి స్టీల్ప్లాంట్ను తన తాబేదారులకు కట్టబెట్టాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజలకు ఉక్కు కర్మాగారంపై వాస్తవాలను వివరించి రానున్న కాలంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ నెల 28న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల్లో గందరగోళాన్ని సృష్టిస్తూ విఆర్ఎస్ పేరుతో చేస్తున్న ప్రచారాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. . వేతనాలను సకాలంలో చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులు సృష్టిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, మొహిద్దీన్, డిఎస్విఎస్.శ్రీనివాస్, కె.బాలశౌరి, కెఆర్కె.రాజు, వి.మురళి, రామచంద్రమూర్తి, డిసి హెచ్.వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ బాధ్యత అధికారులదే



ఎఒకు వినతిపత్రం ఇస్తున్న చెరువుల పరిరక్షణ సమితి నేతలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ అనేక గ్రామాల్లో చెరువులు కబ్జాకు గురయ్యాయని,వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. .ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నీటి వనరుల రక్షణ యాత్రలో భాగంగా పదో రోజు నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ ఎఒ సూర్యనారాయణతో కలిసి రెవెన్యూ డివిజన్ పరిధిలో చెరువులు పరిశీలించారు. ఈ పర్యటనలో అనేక గ్రామాలలో చెరువులు కబ్జాపై స్థానికులు వినతిపత్రాలు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,కబ్జాలకు గురైన చెరువులను రక్షించవలసిన బాధ్యత తక్షణమే అధికారులు చేపట్టాలని కోరారు. లేకుంటే తీవ్ర నీటి ఎద్దడితో భవిష్యత్ తరాలకు అన్యాయం చేసిన వాళ్లమౌతామని మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు చక్రవర్తి మాట్లాడుతూ ఉత్తర వాహిని నదీ ప్రవాహాలు పక్కన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి నది కలుషితం చేయడం మంచిది కాదని,తక్షణమే తరలించే దీన్ని ప్రయత్నం అధికారులు చేయాలని కోరారు.దీనిపై ఎఒ సూర్యనారాయణ మాట్లాడుతూ చెరువుల కబ్జాపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలోకార్యదర్శి మురళి, పాపారావు,, శ్రీనివాసరావు గోపాలరావు, బుజ్జి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన కొత్త ఎల్లవరం విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్బాల్ పోటీలకు గొలుగొండ మండలం కొత్తఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎవిఎన్ఎస్.మూర్తి గురువారం తెలిపారు. వీరిలో బంగారి, జానకి, వర్షిత, అనుశ్రీ, రజిత, భవానీ, సత్యవేణిలు పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని గ్రామ సర్పంచ్ కొల్లి రాంబాబు, పాఠశాల ఛైర్మన్ భీమిరెడ్డి రాజులనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయుర్వేదిక్ డేపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులతో ఆయుష్ వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు గ్రామంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్కుమార్ ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్డే పై అవగాహనా ర్యాలీ చేపట్టారు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మూర్తి రాజు, పిఇటి రామ్ కుమార్, పలువురు విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ నెల 29న ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని డాక్టర్ అభినయ్కుమార్ తెలిపారు. ఆయుష్ యోగా టీచర్లు దవరసింగి రాంబాబు, డిఎన్ వీ సాయి, నరసమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమ ఆరోపణలపై విచారణ



ఉపాధి కూలీలను విచారణ చేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పుత్తడి గైరంపేట పంచాయితీలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్కు మీకోసంలో ఫిర్యాదు అందిన నేపథ్యంలో దీనిపై అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గొలుగొండ ఎంపిడిఒ మేరీ రోజ్, ఉపాధి హామీ పథకం ఎపిఒ సూర్యమణి, ఇసి రాధిక సమక్షంలో గురువారం ఉపాధి కూలీలను విచారించారు. విచారణలో ఉపాధి కూలీలు వెల్లడించిన వివరాలను నమోదు చేసుకుని, జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంపిడిఒ తెలిపారు.

విపత్తుల ఫిర్యాదులకు ప్రత్యేక కౌంటర్

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 25న శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో యధావిధిగా మీకోసం కార్యక్రమం ఉంటుందని, అందులో ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్గా అందే ఫిర్యాదులతో పాటు విపత్తులకు సంబంధించిన ఫిర్యాదులు కూడా ప్రత్యేకంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

ఆడపిల్లల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

కెజిహెచ్ లేడీస్ హాస్టల్‌ను పరిశీలించిన హోంమంత్రి అనిత



కెజిహెచ్ సందర్శనలో హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఆడపిల్లల భద్రతే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం రాత్రి కెజిహెచ్ లేడీస్ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, లేడీస్ హాస్టల్‌లో భద్రత లో భాగంగా సిసి కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంలో కెజిహెచ్ మెడికల్ కాలేజీ విద్యార్థులు కొన్ని సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు.కలెక్టర్, పోలీస్ కమీషనర్ కూడా మెడికల్ కాలేజీని పరిశీలించారన్నారు. వైజాగ్ సిటీలో ఎక్కడా రౌడీ షీటర్ ఉండకూడదన్నారు. ఇప్పుడు పోలీసులు ఎలా పని చేస్తున్నారో ప్రజలే చూస్తున్నారన్నారు. ఏ సంఘటన జరిగినా 24 గంటల్లో నిందితులను పట్టుకుంటున్నామన్నారు. విజయవాడ వరదల్లో పోలీసులు ప్రజల ప్రాణాలు కాపాడారని చెప్పారు. గత ప్రభుత్వంలో పోలీసులు తప్పక పని చేసారని, ఇప్పుడు బాధ్యతగా పని చేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో సిసి కెమెరాలు ఎక్కడా పనిచేసిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా సిసి కెమెరాల కోసం సమీక్ష నిర్వహించారన్నారు. జగనన్న వదిలిన బాణం అతనికే గుచ్చుకుందని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. మంత్రి వెంట ఎంపి ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

పుష్కరిణిలో నాచు తొలగింపునకు చర్యలు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన



పుష్కరిణిలో నాచు తీస్తున్న కూలీలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక పుష్కరిణిలో నాచు,గడ్డి, ఇతర వ్యర్థాలు తొలగింపునకు చర్యలు చేపట్టారు. ప్రజాశక్తి దినపత్రికలో అధ్వానంగా ఉపమాక పుష్కరిణి అనే శీర్షిక బుధవారం ప్రచురణమైన విషయం తెలిసిందే. ఉపమాక వెంకన్న ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్ స్పందించి గురువారం పుష్కరిణి పరిశుభ్రతపై దృష్టి సారించారు. పుష్కరిణి నిండా పేరుకుపోయిన నాచు, గడ్డి,వ్యర్థాలను కూలీలతో తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ పుష్కరిణి చాలా అధ్వానంగా ఉందని, భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే నెల 2 తేదీ నుండి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పుష్కరిణి లో స్నానాలు ఆచరిస్తారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరిణి శుభ్రం చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా నాగమ్మ

ప్రజాశక్తి-రోలుగుంట : రోలుగుంట తహశీల్దార్‌గా గురువారం నాగమ్మ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ కె..వరహాలు బదిలీ అయ్యారు. అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలంలో తహశీల్దార్ పనిచేస్తున్న నాగమ్మ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా రోలుగుంట మండలంలో గతంలో సిఎస్‌డిటిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది.

పాఠశాలలు, హాస్టళ్ల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని ఆనంద నిలయం బాలుర హాస్టల్, కారుణ్య ప్రైవేట్ పాఠశాల, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లలో స్థానిక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ గురువారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. చిన్నారులకు చేతిపై ఎలర్జీని గుర్తించి అధికారులు సూచనలు ఇచ్చారు. వసతి గృహాన్ని తనిఖీ చేసినప్పుడు ప్రతి విద్యార్థికి చేతులపై ఎలర్జీలు వచ్చినట్లు గుర్తించారు. తర్వాత పాఠశాలలను తనిఖీ చేశారు. బిసి బాలుర కళాశాల హాస్టల్ పరిశీలించారు. పరిశీ నర్సీపట్నంలో బాలికలు చాలామంది ఆకతాయిల వేధింపులకు గురవుతున్నట్లు న్యాయమూర్తికి పలువురు ఫిర్యాదు చేశారు. బడి బస్సులు విద్యార్థులకు అందుబాటులో లేవని విన్నవించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

కోటవురట్ల : మండలంలో బిసి, బాలికల వసతి గృహాలను నర్సీపట్నం సివిల్ జడ్జి షియాజ్ ఖాన్ గురువారం సందర్శించారు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వం అందుతున్న వసతి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు పట్ల నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు, పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు అనంతరం వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించారు కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి అఖిల భారత పశుగణన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 25 నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు అఖిల భారత పశు గణన కార్యక్రమం జరుగుతుందని స్థానిక పశు సంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యు రాంబాబు గురువారం విలేకరులకు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

పశు గణనకు నర్సీపట్నం మండలం నుంచి 8 మంది, గొలుగొండ మండలం నుంచి 9 మంది సిబ్బందిని విషయ సేకరణాధికారులుగా నియమించామన్నారు. నర్సీపట్నం, గొలుగొండ మండలాల నుంచి డాక్టర్ పుష్ప, డాక్టర్. రమేష్, డాక్టర్ శిరీష సూపర్వైజర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. పశు గణన అనేది పశు సంవర్థక శాఖ లోని వివిధ రకాల పథకాల రూపకల్పనకు, టీకాల తయారీకి, మందుల పంపిణీకి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పశు గణన కోసం ప్రతి ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు రైతులు సహకరించాలని కోరారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, కుక్కలు, ఇతర జీవాల సమగ్ర సమాచారం తెలియజేయాలని కోరారు.

ఉల్లాస్ పథకంపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులకు ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ విద్యపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ డి.సీతారామరాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై అవగాహన కల్పించేందుకు గాను గ్రామాలవారిగా నిరక్షరాస్యులు సర్వే చేపట్టి గుర్తించాలన్నారు. వారందరికీ వాలంటీర్ల ద్వారా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. గ్రామాల వారీగా సర్వే ఏవిధంగా చేపట్టాలి, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంఇఒలు నరేష్, వేమగిరి నూకరాజు, సిడిపిఒ శ్రీవిద్య, వెలుగు ఎపిఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి

- సాధారణం కంటే ఎక్కువగా 4535 ఎకరాల్లో సాగు
- చీడపీడలు, తెగుళ్ల సోకడంతో రైతుల గుబులు



పలు గ్రామాల్లో ఆహ్లాదకరంగా ఉన్న వరిపైర్లు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వరిపైర్లు ప్రస్తుతం ఎంతో ఆశాజనకంగా ఉంది. మునిపెన్నడూ లేనివిధంగా రైతులు మండలంలో వరి నాట్లు వేసారు. వరి సాగు ఆరంభంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందినప్పటికీ, తదనంతరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతల్లో ఆశలు చిగురింపజేశాయి. మండలంలో వరి సాధారణ సాగు 4400 ఎకరాల్లో కాగా, వాతావరణం అనుకూలించి వర్షాలు కురవడంతో 4535 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి నాట్లు మందకొడిగా సాగాయి. ఆగస్టు నెలాఖరు వరకు 2 వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. ప్రతికూల వర్షాలతో సెప్టెంబర్ మొదటి వారం వరకు రైతులు వరి నాట్లు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆగస్టు చివరి రోజుల్లోనూ, సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు బాగా కురవడంతో రైతులు వరి నాట్లు పూర్తి చేశారు. సాధారణ వర్షపాతం 1032 మిల్లీమీటర్లుకుగాను, 1027 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. దీంతో 4535 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. తుఫాన్ ప్రభావంతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు వరికి ఊపిరినిచ్చాయి. వరి సాగు ఎంతో ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే వరిలో వచ్చే చీడపీడలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం వరిలో ఆకు ముడత, పాము పొడ తెగులు, సుడిదోమ వ్యాపించాయి. పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి చీడ పీడల నివారణ చర్యలు చేపట్టాలని, వరిలో కీలక యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచనలు ఇస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు వరిలో వచ్చే చీడపీడల నివారణ చర్యలు, యాజమాన్య పద్ధతుల లపై దృష్టి సారించారు.. ప్రస్తుతానికి ఈ ఏడాది వరి సాగు లాభదాయకంగా ఉందని రైతులు అ ంటున్నారు.

సస్యరక్షణ, యాజమాన్య చర్యలు చేపట్టాలి



తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ

క్షేత్రస్థాయి పర్యటనలో వరి పైర్లకు పొటాష్ లోపంతోపాటు, ఆకు మడత, పాచి తెగులు, సుడి దోమ సోకడం వంటివి కూడా గుర్తించాం. రైతులు వరినాట్లు వేసినప్పుడు పొటాషియం ఎరువులు వేయకుంటే, పొలం చిరు పొట్టదశలో ఉన్నప్పుడు యూరియా, పొటాషియం ఎరువులను ఎకరాకు 20 కిలోల చొప్పున వేస్తే గింజ నాణ్యత పెరుగుతుంది. వరిలో ఆకు మడత,పాము పొడ తెగుళ్ల నివారణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్, 400 మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ మందులను కలిపి పిచికారి చేయాలి, పొలంలో నీటిని పూర్తిగా తీసేసి, పైర్లతోపాటు గట్టు తడిసేలా పిచికారీ చేయాలి. సుడిదోమ నివారణకు పైమెట్రోజిన్ 50 డబ్ల్యు ఎస్ మందు 0.6 గ్రా, లేదా ఎకరాకు 120 గ్రాములు, డైనోటేఫ్యూరాన్ 20 ఎస్ జి – 0.4 గ్రా. లేకుంటే ఎకరాకు 80 గ్రాములు, ట్రైఫ్లుమిజోపైరిమ్ 96 మి.లీ. వీటిలో ఏదో ఒకటి దుబ్బు మొదళ్ళ వద్ద బాగా తడిసేలా పిచికారి చేయాలి. పొలంలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తీసేస్తూ, ఆడపాదడపా ఆరబెట్టాలి. పొలంలో అక్కడక్కడా దీపపు కాంతి ఎరలను ఏర్పాటు చేయాలి.

- ఉమా ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి